క్లుప్తంగా

పెద్దింటమ్మతల్లికి గాజులతో అలంకరణ



అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమా రామ క్షేత్రమైన అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మతల్లికి శ్రావణ మంగళవారం పురస్కరించుకుని గాజులతో అలంకారం చేశారు. తొలుత పంచామృతాభిషేకం, అనంతరం గాజులతో విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పెద్దింటమ్మ అమ్మవారి సన్నిధిలో సామూహిక శ్రావణ మంగళవార పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్దింటమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యుదీకరణ పనులకు శంకుస్థాపన



సత్తెనపల్లి: పట్టణంలోని ఏపీ టిడ్కో గృహ సముదాయం వద్ద విద్యుదీకరణ పనులకు స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బుల్లి బాబుకు సేవా రత్న అవార్డు



సత్తెనపల్లి: వివిధ సేవలను గుర్తించి హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లి బాబుకు మదర్ థెరిసా సేవా రత్న అవార్డును ప్రదానం చేశారు. విజయవాడలోని మదర్ సర్వీస్ సొసైటీ సేవా సంస్థ ఆధ్వర్యంలో కర్ణాటక, ఒడిస్సా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ స్వచ్ఛంద సంస్థలను గుర్తించి వారికి విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం అవార్డులను ప్రదానం చేశారు. దీనిలో సత్తెనపల్లికి చెందిన కంచర్ల బుల్లిబాబు అవార్డు అందుకున్నారు. ఆయనను మంగళవారం పలువురు అభినందించారు.

ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే



నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న ముసాయిదా ఓటర్ల జాబితా తనిఖీల్లో భాగంగా ఇంటింటి సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానీశంకర్ మంగళవారం పరిశీలించారు. ఒకే ఇంటి నంబర్‌తో ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉండటం, జీరో డోర్ నంబర్‌లో ఓటర్ల నమోదు కావడం వంటి తప్పిదాలు లేకుండా పరిశీలించారు. ఓటరు జాబితాలో ఉన్నట్లుగా ఓటరు ఆ ఇంటిలో నివసిస్తున్నాడా లేదా అని, అలాగే గతంలో ఓటు ఎక్కడైనా ఉంటే దాన్ని రద్దు చేసుకునేలా చూడాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితాలో పేరు సవరణ, ఫొటో మార్చుకొనుటకు దరఖాస్తు అందించవచ్చని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఎస్ఐ రాజేష్



బెల్లంకొండ: వచ్చే నెల 7న వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాలలో గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ రాజేష్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు ముందుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేయు ప్రదేశం , ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహించేది వంటి వివరాలను తెలియజేయాలని సూచించారు. తద్వారా సమస్యాత్మక ప్రదేశాలలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎవరికీ ఇబ్బందులు లేకుండా పూజలు జరుపుకోవాలని, అధిక శబ్దంతో మైకుల ఏర్పాటు నిషేధమని తెలిపారు. ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కఠిన శిక్షలతోనే అఘాయిత్యాలకు అడ్డుకట్ట



బెల్లంకొండ: కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన దోషులకు వెంటనే శిక్ష పడినట్లయితే దేశంలో మరెక్కడా అటువంటి ఘటనలు జరగవు. రోగుల ప్రాణాలను నిలిపే వైద్యులతో పాటు సిబ్బందిపై దేశంలో నిత్యం ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. ప్రాణం పోసే వైద్యులపై ఇటువంటి ఘటనలకు దిగితే వైద్యం ఎలా అందించాలి. రాత్రి సమయాల్లో విధులకు హాజరయ్యే వైద్యులు, వైద్య సిబ్బందికి వాహన సదుపాయం కల్పించాలి.

– అరుణ, ఏఎన్ఎం, చంద్రాజుపాలెం పీహెచ్‌సీ, బెల్లంకొండ

మహిళా వైద్యులకు భద్రత పెంచాలి



వైద్యులకు, వైద్య సిబ్బందికి నూరు శాతం రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో మెడికల్ కాలేజీ వైద్యురాలిపై హత్యాచారం దుర్మార్గపు చర్య . ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. మహిళా వైద్యులకు భద్రత కల్పించే విషయమై శ్రద్ధ చూపాలి. రాత్రి వేళల్లో బీట్ కానిస్టేబుల్ వైద్యశాలలకు రక్షణగా ఉండాలి. స్త్రీలను గౌరవించే సంస్కృతి అందరిలోనూ రావాలి.

–డాక్టర్ విద్య, సీహెచ్‌సీ, సూపరింటెండెంట్, పెదకూరపాడు

ఈ-పంట... అదే తంటా

- ఈ-పంట నమోదుకు సెప్టెంబర్ 15 వరకే అవకాశం
- ఎన్ఐసీ సర్వర్ మొరాయించడంతో నమోదుకు ఆలస్యం
- సంక్షేమ పథకాలన్నిటికీ ప్రామాణికం ఈ-పంట



సాగులో ఉన్న పత్తి పంట

సత్తెనపల్లి: కాలానుగుణంగా రైతులు పండిస్తున్న పంట, వారి వివరాలు నమోదు చేసే ఈ-పంట నమోదు కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ఈ-పంట నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీని గడువుగా నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకులు రైతు వేసిన పంట వివరాలు, రైతు ఖాతా, సర్వే నంబర్, మొబైల్ ద్వారా ఈ-పంటను నమోదు చేసి జాతీయ స్థాయిలోని ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్) సర్వర్‌కు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే జాతీయ స్థాయిలోని ఎన్ఐసీ సర్వర్ మొరాయిస్తుండడంతో నమోదు ఆలస్యం అవుతుంది. వ్యవసాయ సహాయకులు సెలవు రోజుల్లో సైతం ఈ-పంట నమోదుకు ప్రయత్నిస్తున్నా సర్వర్ సహకరించక పోవడంతో ఉసూరుమంటున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 15వ తేదీలోగా ఈ-పంట నమోదు సాధ్యమేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ-కేవైసీ మరింత ఆలస్యం

ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి వివిధ పంటల సాగుకు సంబంధించి ఈ-పంట నమోదు చేపట్టారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఖరీఫ్ పంట కాలానికి 1,94,062.46 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటివరకు 75,864.65 ఎకరాలు సాగైంది. దీనిలో 40,554.81 ఎకరాలు మాత్రమే ఈ-పంట నమోదు చేశారు. మిగిలింది చేయాల్సి ఉంది. పంట బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, యంత్ర పరికరాల నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్ల మంజూరు వంటి ప్రయోజనాలు పొందడానికి ఈ-పంట నమోదునే ప్రామాణికంగా తీసుకుంటారు. అయితే సర్వర్ సమస్య కారణంగా రైతుల ఈ-కేవైసీ మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎన్ని సర్వే నంబర్లకు ఈ-పంట నమోదు చేశారో అన్ని సర్వే నంబర్లకు రైతుల ఈ-కేవైసీని అప్‌లోడ్ చేసి రైతు వేలిముద్రను తీసుకొని సబ్‌మిట్ చేస్తే ఈ-పంట నమోదు వంద శాతం పూర్తవుతుంది. అయితే ఎన్ఐసీ సర్వర్ మొరాయించడంతో గడువులోగా రైతుల ఈ-కేవైసీ వంద శాతం నమోదు అవుతుందో లేదోనని అధికారుల్లో సైతం ఆందోళన నెలకొంది.

సత్తెనపల్లి డివిజన్‌లో పంట సాగు వివరాలు ఇలా...

మండలం	సాధారణసాగు (ఎకరాల్లో)	సాగు (ఎకరాల్లో)	ఈ-పంట నమోదు	శాతం
సత్తెనపల్లి	34,337.02	14,195.90	6,820.00	48.34
ముప్పాళ్ల	15,463.52	2,382.04	1,278.60	53.68
రాజుపాలెం	14,959.43	5,653.65	4,681.13	82.80
నకరికల్లు	19,048.94	2,732.93	2,080.60	76.13
పెదకూరపాడు	22,735.67	12,177.09	5,062.94	41.58
అమరావతి	25,928.20	15,362.20	7,570.16	48.80
అచ్చంపేట	24,341.82	9,701.15	5,970.81	61.55
క్రోసూరు	23,299.06	9,352.74	3,634.21	38.86
బెల్లంకొండ	13,948.80	4,306.95	3,474.34	80.67

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ఉట్టి కొట్టే సంబరాల్లో పాల్గొన్న ఎస్ఐ షఫీ



క్రోసూరులో గ్రామోత్సవం, ఉట్టి కొట్టే సంబరాల్లో ఎస్ఐ షఫీ

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరులో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి గుడి నుంచి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో లభించే పండ్లు, అటుకులు, మీగడ, పాలు, పెరుగు వెన్న స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఊయలలో శ్రీకృష్ణుని ప్రతిమనుంచి ఊపుతూ పాటలు, కీర్తనలను ఆలపించారు. యాదవరాజులు, భక్తులు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరులోని మూడు సెంటర్లలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. క్రోసూరు ఎస్ఐ ఎస్ఎం షఫీ పాల్గొని యువతకు ఉత్తేజం కలిగించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మన గ్రోమోర్‌లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో కె.దేవదాసు

నకరికల్లు: నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదేశించారు. స్థానిక మన గ్రోమోర్ కేంద్రంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా పురుగు మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్ పరిశీలించారు. పురుగు మందుల నిల్వల్లో మూడు రకాల పురుగు మందుల నమూనాలు సేకరించి నాణ్యతా ప్రమాణాల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు విక్రయించే సమయంలో లోపాలు లేకుండా చూసేందుకు నిరంతరం క్రయ విక్రయాలపై నిఘా పెట్టామన్నారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగుకు జీవామృతం శ్రీరామ రక్ష



జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు

పెదకూరపాడు: ప్రకృతి సాగుకు జీవామృతం శ్రీరామ రక్షణ అని 75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు ప్రకృతి సాగుపై జీవశాస్త్ర ఉపాధ్యాయుడు యక్కంటి విజయ భాస్కర్ రెడ్డి అవగాహన, జీవామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జీవామృతం తయారీకి పది కిలోల ఆవుపేడ, పదిలీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల శనగపిండి, రెండు కిలోల బెల్లం, ఒక కిలో మట్టి, 200 లీటర్ల నీరు కలిపి బాగా కలియ తిప్పాలన్నారు. ఈ విధానాన్ని విద్యార్థులచే చేయించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కలియ తిప్పాలని, ఐదు రోజుల పాటు తిప్పితే జీవామృతం వినియోగించుకోవచ్చన్నారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జీవామృతం తయారు చేసి పాఠశాల ఆవరణలో ఆకుకూరలు, కాయగూరలు పండించి పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తామన్నారు. కార్యక్రమంలో పీఈటీ అరుణశ్రీ, ఉపాధ్యాయులు బాలకృష్ణ రెడ్డి, రమేష్, కోటేశ్వరరావు, పీసీ చైర్మన్ గంటా పున్నారావులు పాల్గొన్నారు.

ఫర్నిచర్, నోట్ పుస్తకాలు అందజేత



పెదకూరపాడు: పెదకూరపాడు జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థి అత్తోట మురళిముకుంద్ తను చదువుకున్న పాఠశాలతో పాటు మండలంలోని ఎస్సీ కాలనీలో ఉన్న పాఠశాల విద్యార్థులను, పాఠశాలలను ఆదుకుంటున్నాడు. ఆర్థికంగా స్థిర పడిన మురళి ముకుంద్ తరఫున ప్రతినిధి మంగళవారం పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలకు రూ.2 లక్షలు విలువ చేసే ఫర్నిచర్, ఆట వస్తువులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణకు అందించారు. మండలంలోని పెదకూరపాడు హెచ్‌డబ్ల్యూ పాఠశాల, ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, జేబీ పాఠశాల, లగడపాడు జేబీ పాఠశాల, కన్నెగండ్ల ఎంపీపీఎస్ పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. గతంలో పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఆర్థిక బలోపేతం చెందిన వ్యక్తులు పేద విద్యార్థులను, ప్రభుత్వ పాఠశాలలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. మురళి ముకుంద్ తరఫున పుస్తకాలు, ఫర్నిచర్ అందించిన ఆయన ప్రతినిధి లక్ష్మీనారయణను సత్కరించారు. హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు సాంబశివరావు, పీఈటీ నాగరాజు ఉన్నారు.

చల్లగా చూడమ్మ... పోలేరమ్మ తల్లి



పెదకూరపాడు: చల్లగా చూడమ్మ పోలేరమ్మ తల్లి అంటూ భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని కొర్కెలు తీర్చే తల్లి పోలేరమ్మ దేవాలయం వార్షికోత్సవం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల్లో మహిళలు అనేక మంది తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లను సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారు మంగళవారం ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. ఆలయ పూజారి అమ్మవారిని ప్రత్యేకంగా ఒత్తులతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వికలాంగుడు మృతి

వెల్దుర్తి: మండల కేంద్రమైన దుర్గిలో గత 10 సంవత్సరాలుగా భిక్షాటన చేస్తున్న జగన్నాధ రెడ్డి (45) అనే వికలాంగుడు రోడ్డు పక్కన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు సూరె కృష్ణ, జనసేన నాయకులు రుద్రా రవి.. జగన్నాధరెడ్డి మృతి చెందిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు మాట్లాడుతూ దుర్గిలో గత 10 ఏళ్లగా భిక్షాటన చేస్తూ జీవనం చేస్తున్న జగన్నాధరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకొని అతని అంత్యక్రియలు కుటుంబ సభ్యులతో దగ్గరుండి చేయించటం జరిగిందన్నారు.

నర్సింగపాడులో వైద్య శిబిరం



నకరికల్లు: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నకరికల్లు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మణికంఠ సూచించారు. నకరికల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని నర్సింగపాడు గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో మార్పుల వలన జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు, జ్వరం లాంటి అనారోగ్య సమస్యలు ఉంటాయన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సురక్షిత మంచి నీటినే తాగాలన్నారు. వేడి ఆహార పదార్థాలు భుజించాలని అన్నారు. చిన్నపాటి జలుబు, జ్వరం ఉన్నప్పటికీ వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు. పీహెచ్‌సీలో రక్త నమూనాలు సేకరించి మందులు ఉచితంగా అందజేస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ విజయమ్మ, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న అత్తలూరు పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు

అమరావతి: ప్రతి ఒక్కరికి నేత్రదానంపై అవగాహన అవసరమని మండల నేత్ర వైద్యాధికారి పివిడి శివరామ సుబ్బారావు అన్నారు. మంగళవారం నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని అత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో శివరామసుబ్బారావు మాట్లాడుతూ మన దేశంలో నేత్రదానం కోసం సుమారు 11 లక్షల మంది ఎదురు చూస్తున్నారని వారిలో అత్యధికంగా చిన్నారులే ఉన్నారని, ప్రతి యేటా మరో 25 వేల చిన్నారులు పెరుగుతూనే ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన ఏర్పరుచుకుని కళ్ల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. నేత్రదానం 3 సంవత్సరాల చిన్నారుల మొదలు 70 సంవత్సరాల వృద్ధులు వరకు చేయవచ్చన్నారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నేత్ర సంబంధమైన వ్యాధులు, నేత్రదానంపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నేత్రదానంపై అవగాహన ఏర్పరచే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి

పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు



రోగితో మాట్లాడుతున్న వైద్యులు కోటేశ్వరరావు

బెల్లంకొండ: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతుండడంతో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కేవీ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 143 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారిలో 11 మంది జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు తెలియజేశారు. ఒంటి నొప్పులతో బాధపడుతున్న 72 మంది రక్త నమూనాలను సేకరించినట్లు పేర్కొన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలను వాడాలని సూచించారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. వైద్య శిబిరంలో సూపర్ వైజర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ సుభాని, ఏఎన్ఎం ఎలిజబెత్ రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న ఐటీసీ సెర్ప్ ప్రతినిధి సతీష్

క్రోసూరు: ఐటీసీ బంగారు భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యత అంశాలపై మండల క్లాప్ మిత్రలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐటీసీ సెర్ప్ ప్రతినిధి ఎస్.సతీష్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, పీఎం జేజేవై, పీఎం ఎస్‌బీవై వంటి జీవిత బీమా పథకాల ద్వారా గ్రామాలలోని పేదలకు ఆరోగ్యం, బీమా ప్రయోజనాలు ఏ విధంగా కలుగుతాయో తెలిపారు. దాంతో పాటు పీఎం ముద్ర యోజన, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజన ప్రయోజనాలను వివరించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ప్రయోజనం పొందడంతో పాటు ప్రతి ఒక్కరు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అన్ని పంచాయతీల క్లాప్ మిత్రలు, ఐటీసీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సీహెచ్ బొల్లయ్య పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో సిల్ట్ తొలగింపు



మురుగు కాలువల్లో సిల్ట్ తొలగిస్తున్న కార్మికులు

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రధాన రహదారిలోని మురుగు కాలువల్లో సిల్ట్ తొలగింపు ప్రక్రియను మంగళవారం చేపట్టారు. పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ఆర్‌సీఎం చర్చ్ వద్ద కాలువల్లోని మురుగును తొలగించారు. అయితే కార్మికులకు కనీసం రక్షణ కవచాలు కూడా అందించలేదు. అసలే విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో మురుగును తొలగించేందుకు రక్షణ కవచాలు అందించక పోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.

తారకరామ చెరువును నింపండి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య



ఇన్‌చార్జ్ మున్సిపల్ మేనేజర్ అప్పారావుకు వినతి పత్రం అందిస్తున్న గద్దె చలమయ్య

సత్తెనపల్లి: పట్టణంలోని తారకరామ చెరువును సాగర్ జలాలతో నింపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జ్ మున్సిపల్ మేనేజర్ ఆర్‌వీ అప్పారావును కలిసి వినతి పత్రం అందించారు. చలమయ్య మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంలోని తారకరామ చెరువు, దాని చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్ పట్టణ ప్రజలకు సేద తీర్చుకునేందుకు, ఆహ్లాదాన్ని ఇచ్చే ముఖ్యమైన వనరుగా ఉందన్నారు. ప్రస్తుతం చెరువులో నీరు లేక ఎండి పోయిందన్నారు. ఎన్ఎస్పీ కాలువల ద్వారా నీరు వృథాగా వాగులకు పోతుందని, ఆ నీటిని తారకరామ చెరువుకు మళ్లించితే వాతావరణం చల్లబడుతుందన్నారు. భూగర్భ జలాల మట్టం పెరుగుతుందన్నారు. అక్కడకు వచ్చే ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు. వృథాగా పోయే నీటితో తారకరామ చెరువును నింపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

6 బస్సులపై కేసు నమోదు

గురజాల : అనుమతులు లేకుండా తిరుగుతున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులపై మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి కేసు నమోదు చేశారు. మండలంలోని పాఠశాలల బస్సులను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 6 బస్సులపై కేసు నమోదు చేశారు. రూ.31,250 అపరాధ రుసుం విధించినట్లు ఎంవీఐ తెలిపారు. అనుమతులు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు చేపడతామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాదారులు వ్యవహరించరాదన్నారు.

